www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 4 ఏప్రిల్ 2025



సత్యసాయి తాగునీటి పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా కలెక్టరేటు గౌతమి సమావేశ మందిరంలో శ్రీ సత్యసాయి తాగునీటి పథకం నిర్వహణ పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మెట్ట మండలాల్లో ప్రజల దాహార్తిని తీరుస్తున్న శ్రీ సత్యసాయి తాగునీటి పథకం నిర్వహణను పకడ్బందీగా చేయాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎటువంటి ఆటంకం లేకుండా, తాగునీటి పథకాలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిల్లాలో నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో ఆర్‌డబ్ల్యూఎస్, శ్రీ సత్యసాయి తాగునీటి నీటి పైపు లైన్లు వివరాలను ముందుగానే సంబంధిత రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లకు తెలియజేయాలని, రోడ్ల నిర్మాణ సమయంలో పైపులైన్లు దెబ్బ తినకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రక్త పరీక్షా కేంద్రాల్లో.. నిబంధనలు గాలికి..!

ఏలూరు జిల్లాలో అనుమతి పొందిన వంద ల్యాబ్‌లు

పశ్చిమలోనే దాదాపు అదే పరిస్థితి

ల్యాబ్‌ల వద్ద కానరాని ధరల పట్టికలు

కొరవడిన ఆరోగ్యశాఖ అధికారుల తనిఖీలు

అనుమతులు లేని ల్యాబ్‌లు కొనసాగుతున్నట్లు చర్చ

రక్త పరీక్షా కేంద్రాల్లో సిబ్బంది అర్హతపై అనుమానాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రక్త పరీక్షా కేంద్రాల్లో (ల్యాబ్స్) నిబంధనలు అమలు కాని పరిస్థితి నెలకొంది. ఆరోగ్యశాఖ అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో ల్యాబ్ యాజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారంటూ జనం గగ్గోలు పెడుతున్నారు. ప్రజల రోగనిర్ధారణలో అత్యంత కీలకంగా ఉన్న రక్త పరీక్షా కేంద్రాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏలూరు జిల్లాలో వంద రక్త పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. పశ్చిమలోనూ దాదాపు అదే విధంగా ఉన్నాయి. రెండు జిల్లాల్లోనూ రక్తపరీక్షా కేంద్రాలపై సరైన పర్యవేక్షణ లేకుండా పోయిందని చెప్పొచ్చు. జ్వరం నుంచి శరీరంలో ఏసమస్య వచ్చినా రక్తపరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాతే డాక్టర్లు వైద్యం అందిస్తారు. రక్త పరీక్షా కేంద్రాల ఏర్పాటు, వాటి అమలుపై అనేక నిబంధనలు ఉన్నాయి. ఆరోగ్యశాఖ విధించిన నిబంధనలను రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోని పరిస్థితి కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి రక్త పరీక్షా కేంద్రం వద్దా ఏ టెస్ట్‌కు ఎంత ఫీజు అనేది పట్టిక రూపంలో ఏర్పాటు చేయాలి. దాని ప్రకారమే రోగుల నుంచి వసూలు చేయాలి. ఏలూరు పట్టణంతోపాటు, ఏ ఒక్క రక్త పరీక్షా కేంద్రం వద్ద ధరల పట్టిక లేదంటే అతిశయోక్తికాదు. ధరల పట్టికపై రోగులు అడిగినా సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. దీంతో రక్త పరీక్షలకు ఇష్టానుసారం ధరలు వసూలు చేస్తున్నారు. ఒకే పరీక్షకు ఒక ల్యాబ్‌లో ఒక ధర, మరో ల్యాబ్‌లో ఇంకో ధర ఉంటుంది. సుగర్ నిర్ధారణ టెస్ట్‌కు ఒకచోట రూ.50 తీసుకుంటే, మరో ల్యాబ్‌లో రూ.వంద, ఇంకో ల్యాబ్‌లో ఇంకోవిధంగా వసూలు చేస్తున్నారు. విటమిన్ డి, బి-12 వంటి పరీక్షలకు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. డెంగీ నిర్ధారణ పరీక్ష ప్రయివేటు ల్యాబ్‌లో చేసే అవకాశం లేదు. కానీ చాలా ల్యాబ్‌ల్లో స్థానిక వైద్యులతో కుమ్మక్కై డెంగీ ఉందంటూ రోగులను భయపెడుతున్న



పరిస్థితులు సైతం కొనసాగుతున్నాయి. పలు ఆసుపత్రులతో రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు ఏకమవుతున్నారు. ప్రతి పరీక్షకూ ఆయా ఆసుపత్రులకు పర్సంటేజ్‌ల రూపంలో కమీషన్‌లు ల్యాబ్ నిర్వాహకులు ఇస్తుంటారు. ఈ కమీషన్ 40 నుంచి 50 శాతం వరకూ ఉంటుందని తెలుస్తోంది. దీంతో రోగుల నుంచి భారీగా దోపిడీ చేస్తున్న పరిస్థితి నెలకొంది. రక్త పరీక్షలకు సంబంధించిన ధరల నిర్ణయంపై జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు అసలు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో ల్యాబ్ నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లుగా తయారవుతోంది. రక్త పరీక్షా కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు సరిగ్గా అమలుకాకపోవడంతో రోగులు భారీ దోపిడీకి గురికావడంతోపాటు, అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ..

రక్తపరీక్షా కేంద్రాలను ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేయాలి. అసలు తనిఖీలు జరుగుతున్నాయా అన్న అనుమానాలు నెలకొన్నాయి. ఏదైనా సమస్య బయటపడినప్పుడు మాత్రం హడావుడీ చేయడం, తర్వాత వదిలేయడం ఆరోగ్యశాఖ అధికారులకు పరిపాటిగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా ప్రతి ఐదేళ్లకోసారీ రిజిష్టర్ అయిన రక్తపరీక్షా కేంద్రాలకు సంబంధించి రెన్యువల్ చేయించుకోవాలి. నిబంధనలు ఎవరూ పాటించడం లేదు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న రక్తపరీక్షా కేంద్రాలు చాలా ఉన్నట్లు జనాల్లో చర్చ సాగుతోంది. ఒకపేరు మీద పరీక్షా కేంద్రం రిజిష్టర్ చేస్తూ మరొకరు నిర్వహిస్తున్న పరిస్థితులు సైతం ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులతో ఆరోగ్యశాఖలోని అధికారులు కుమ్మక్కై పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రక్తపరీక్షా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది అర్హతలపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. రక్త పరీక్షలు చేయాలంటే ఎంఎల్‌టికి సంబంధించిన డిప్లమో, బిఎస్‌పి ల్యాబ్ టెక్నీషియన్ వంటి కోర్సులు చదివిన వారు ఉండాలి. చాలా రక్త పరీక్షా కేంద్రాల్లో అర్హత లేనివారిని తక్కువ జీతాలకు నియమిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల కనీస పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. అధికారుల తనిఖీలు లేకపోవడంతో ధరల పట్టిక నుంచి, సిబ్బంది నియామకం వరకూ రక్తపరీక్షా కేంద్రాల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు రక్తపరీక్షా కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించకపోతే రోగులు మరిన్ని ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలి

సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



ఆందోళన చేస్తున్న కార్మికులు, నేతలు

ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ నూజివీడు మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఆప్కాస్ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన కార్మికుల చేతికి జీతం గ్యారెంటీగా వస్తుందని, జీతాలు చెల్లింపులో ఏ విధమైన కోతలు ఉండడం లేదని, పిఎఫ్, ఇఎస్ ఐ వాటా నిధులు కార్మికుల ఖాతాలో సక్రమంగా జమ అవుతున్నాయని, ఎటువంటి వేధింపులూ, బెదిరింపులూ లేవని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆప్కాస్ తొలగించి ప్రయివేటు ఏజెన్సీలకు మున్సిపల్ కార్మికులను అప్పగించే ప్రయత్నాల్లో ఉన్నట్టు వార్తలు వస్తున్నాయని తెలిపారు. అయితే ప్రయివేటు ఏజెన్సీలు కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నాయని, కార్మికుల జీతాలు వారి చేతికి గ్యారెంటీగా వస్తాయనే నమ్మకం లేదని తెలిపారు. అక్రమ తొలగింపులు పెరిగి కార్మికులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు సిఐటియు యూనియన్ కార్యదర్శి కె.జయలక్ష్మి, గౌరీ, భారతి, పంగిడి అమ్మ, భవాని, చంద్రశేఖర్, ఏడుకొండలు, శోభన్ బాబు, జాను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

ఏటా మూడు పంటలు పండించేలా రైతులను సమాయత్తం చేయాలి

జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

కనీస మద్దతు ధర కోరుకునే స్థాయి నుంచి తాను పండించిన పంటకు ధరను డిమాండ్ చేసే స్థాయికి జిల్లాలోని ప్రతి రైతునూ తీసుకెళ్లేలా వ్యవసాయాధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక గోదావరి సమావేశం హాల్లో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో జిల్లాను రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయాధికారులు, రైతులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆహారాన్ని అందించే రైతే రాజు అని తెలిపారు. తాను పండించిన పంటకు ధరను డిమాండ్ చేసి, మార్కెట్‌ను శాసించే స్థాయికి ప్రతి రైతునూ తీసుకెళ్లే ధ్యేయంతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఏడాదికి మూడు పంటలు వేసే విధంగా, సమగ్ర వ్యవసాయ విధానం ద్వారా సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచేలా రైతులను సమాయత్తం చేస్తామన్నారు. సాగులో డ్రోన్లతో పాటు యాంత్రీకరణను ప్రోత్సహించడం, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన, రైతులు తాము పండించిన పంటలకు కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు తదితర అంశాలను ప్రతి రైతుకూ తెలియజేసేందుకు గ్రామ, మండల స్థాయిల్లోని వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. రైతులు సాగుచేసే పంటల వివరాలు, పంటలకు అవసరమైన మార్కెటింగ్ సౌకర్యాలు, రైతులకు కావాల్సిన కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్, యాంత్రీకరణ, తదితర సౌకర్యాలు తెలుసుకుని వాటికి ఆయా రైతులకు అందించేలా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు జిల్లాలో ప్రతి రైతునూ రాజు చేసే బృహత్తర బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, మార్కెఫెడ్, ఎపి సీడ్స్, ఎపి ఆగ్రోస్ జిల్లా మేనేజర్లు గుప్త, అనిత, హరీష్ రాజ్, వ్యవసాయ శాఖ శాస్త్రజ్ఞులు, అసిస్టెంట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

గందరగోళంగా పది మూల్యాంకనం!

ముందుకు రాని ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



రిపోర్టు చేయకుండా బయట ఉన్న ఉపాధ్యాయులు

పదో తరగతి పరీక్షల పేపర్ల మూల్యాంకనం గురువారం గందరగోళ పరిస్థితుల మధ్య ప్రారంభమైంది. స్థానిక సెయింట్ జెవియర్ ఉన్నత పాఠశాలలో అధికారులు మూల్యాంకనం ఏర్పాట్లు చేశారు. అయితే ఉదయం 8:30 గంటలకు ఉపాధ్యాయులను రిపోర్టు చేయాలని చెప్పినప్పటికీ ఉపాధ్యాయులు అక్కడికి చేరుకున్నప్పటికీ కూడా విధులకు హాజరయ్యేందుకు విముఖత చూపుతున్నారు. మండల విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుల జాబితాలు పట్టుకుని అక్కడ టేబుల్స్ వేసుకుని కూర్చున్నప్పటికీ ప్రాంగణంలోకి చేరుకున్న ఉపాధ్యాయులు కూడా రిపోర్ట్ చేయకుండా సరిపడా సిబ్బంది వస్తే తాము వెనక్కి వెళ్లిపోవచ్చని ఎదురుచూస్తున్నారు.

ఈ మూల్యాంకనం కేంద్రానికి మొత్తం 1,80,000 పేపర్లు వచ్చాయి. మొత్తం 1,310 మంది విధులకు హాజరు కావాల్సి ఉండగా మధ్యాహ్నం 12:30 గంటల సమయానికి 832 మంది మాత్రమే రిపోర్ట్ చేశారు. మిగిలిన వారు అదే ప్రాంగణంలో ఉన్నప్పటికీ ఏదో ఒక కారణం చెప్పి తిరిగి వెళ్లపోయేందుకు ఎదురుచూస్తూ గుంపులు గుంపులుగా నిలబడి ఉండడం విశేషం. మధ్యాహ్నం 12:30 గంటలకు బయాలజీలో 207 మంది రావాల్సి ఉండగా కేవలం 120 మంది మాత్రమే రిపోర్ట్ చేశారు. అలాగే భౌతికశాస్త్రంలో 167 మందికి 108 మంది మాత్రమే రిపోర్టు చేయడం జరిగింది. తెలుగు సబ్జెక్టుకు మరో 74 మంది, ఇంగ్లీష్ సబ్జెక్టుకు 67 మంది రావాల్సి ఉంది. మరికొంత మంది ఉపాధ్యాయులు అయితే ప్రాంగణంలోకి రాకుండా రోడ్డుమీదే ఉండి ఎదురుచూస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల సమయానికి కూడా తెలుగు, గణితం, భౌతిక శాస్త్రం సబ్జెక్టుల్లో సరిపడా ఉపాధ్యాయులు రాగా హిందీ, బయాలజీ సోషల్ వంటి సబ్జెక్టులకు ఇంకా సరిపడా ఉపాధ్యాయులు రిపోర్ట్ చేయని పరిస్థితి ఉంది. జిల్లా విద్యాశాఖ అధికారి స్వయంగా మైక్ పట్టుకుని ఉపాధ్యాయుల వెంటనే వచ్చి రిపోర్టు చేయాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని పదేపదే హెచ్చరిస్తూ ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. అనారోగ్య కారణాలు చెప్పి కొంతమంది, చిన్నపిల్లలు ఉన్నారని చెప్పి కొంతమంది, వేరే ఇతర కారణాలతో కొంతమంది మూల్యాంకనం విధుల నుంచి బయటపడేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నించడం కనిపించింది. గతంలో పోటీపడి మరీ మూల్యాంకనం డ్యూటీలు కావాలని వేయించుకునే పరిస్థితి ఉండేది. కానీ అనారోగ్యం లాంటి ప్రత్యేక కారణాలు ఉన్న కొద్దిమంది కాకుండా, వందల సంఖ్యలో మూల్యాంకనం విధులకు గైర్హాజరు కావడానికి ప్రయత్నించటానికి మూల్యాంకనంకు ఇచ్చే పారితోషికం తక్కువగా ఉండడం కూడా ఒక కారణంగా కనిపిస్తుంది. మూల్యాంకనం విధులకు హాజరైన వారికి రోజుకు 40 పేపర్లు మాత్రమే ఇస్తారు. ఒక్కో పేపర్‌కు పది రూపాయలు రెమ్యూనరేషన్‌గా ఇవ్వటం జరుగుతుంది. అంటే 400 రూపాయలు ఒక్కో రోజుకు వస్తాయి. మూల్యాంకనం ఈనెల తొమ్మిదో తారీఖు వరకూ అంటే ఏడు రోజులు పాటు జరగనుండగా సబ్జెక్టును బట్టి కొంతమంది ఉపాధ్యాయులకు నాలుగు, ఐదు రోజులకే మూల్యాంకనం పూర్తవ్వొచ్చు. మరి కొంతమందికి ఏడు రోజులు ఉండొచ్చు. ఈ లెక్కన 1600 నుంచి 2800 రూపాయల లోపు ఉపాధ్యాయులకు పారితోషికం వచ్చే అవకాశం ఉంది. ఇంత చిన్న మొత్తం కోసం జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఉదయం ఆరు గంటలకే పిల్లల్ని వదిలేసి, కుటుంబాన్ని వదిలేసి బస్సులు ఎక్కి రావాల్సి ఉండటం, రాత్రి లేటుగా ఇళ్లకు చేరుకోవడం వంటి కారణాలు కూడా ఉపాధ్యాయులు వెనకడుగు వేయడానికి కారణంగా కనిపిస్తోంది. ప్రభుత్వం పారితోషికం పెంచితే మరికొంత ఉత్సాహంగా ఉపాధ్యాయులు ముందుకు రావడానికి అవకాశం ఉంది. విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మను వివరణ కోరగా విధులకు హాజరుకాని ఉపాధ్యాయులు అందరికీ షోకాస్ నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.





టి.నరసాపురంలో...

ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలి

క్రైస్తవ సంఘాల శాంతి ర్యాలీలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

క్రైస్తవ మత ప్రబోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని, అతని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని క్రైస్తవ సంఘాల నాయకులు, విశ్వాసులు గురువారం శాంతియుత ర్యాలీ, నిర్వహించారు. మండల కేంద్రమైన టి.నరసాపురం హైస్కూల్ వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అందించారు. ఈ ర్యాలీ ప్రదర్శనను ఉద్దేశించి పాస్టర్లు బి.అనిల్‌కుమార్, కె.నిరీక్షణరావు, పి.ఏసుపాదం, డి.సామ్యూల్ రాజు పలువురు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవ సమాజానికి దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయన మృతికి కారణాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలన్నారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు బి.బెసలేలు, సిహెచ్.హెూషేయ, ఆర్.మోషే, బి.రమేష్, వై.పాల్‌చిన్నారావు, నవజీన్ పాల్, బి.కిషోర్, ప్రేమ్‌కుమార్, ప్రసన్నకుమార్, శ్యామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం : పాస్టర్ ప్రవీణ్ పగడాలను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ కొయ్యలగూడెం మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు ఎం.దేవసహాయం ఆధ్వర్యంలో గురువారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో జిడిఎం చర్చి వద్ద నుంచి వివిధ క్రైస్తవ సంఘాల కాపరులు, విశ్వాసులు ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్ కార్యాలయం వరకు వచ్చి తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎం.దేవసహాయం మాట్లాడుతూ క్రైస్తవ ప్రబోధకులు ప్రవీణ్ పగడాల మృతి తమకు ఎంతో దుఖాన్ని మిగిల్చిందన్నారు. ఆయన మృతిపై సమగ్ర విచారణ జరిపి ప్రవీణ్ పగడాల కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. సెక్రటరీ బాలస్వామి మాట్లాడుతూ భారతదేశంలో ఎన్నడూ లేని విధంగా క్రైస్తవులకు చెందిన చర్చిలను కూల్చి వేస్తున్నారని, క్రైస్తవులను అన్యాయంగా చంపేస్తున్నారని, ప్రభుత్వం క్రైస్తవులకు ఎటువంటి హాని జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బి.శామ్యూల్‌రాజు, కె.డానియేల్, పాల్ అన్న, బెంజిమెన్, సింగ్, కె.బాబూరావు, టిఎన్.స్నేహన్, మండలంలోని పాస్టర్లు, క్రైస్తవ సోదరి, సోదరమణులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల పట్ల ప్రేమ చూపాలి

ఉపకరణాలు పంపిణీ చేసిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు పట్ల ప్రేమ చూపాలని కలెక్టర్ వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల 500 మంది పిల్లలకు రూ.75 లక్షల విలువైన వివిధ రకాలు ఉపకరణాలను ఉచితంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి సంయుక్తంగా పాల్గొని పంపిణీ చేసి పిల్లల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల 500 మంది విద్యార్థులకు రూ.75 లక్షల విలువైన ఉపకరణాలు ఉచితంగా పంపిణీ చేశామని, ఇప్పటివరకు 852 మంది పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేసి, రాష్ట్రంలోనే ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, వైద్య సేవలు, విద్యాబుద్ధులు నేర్పించే బాధ్యత ప్రత్యేక ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున ఉపకరణాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అన్ని విధాలుగా సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు సమాజంలో అందరితో సమానంగా ఎదిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వ పరంగా కావాల్సిన సదుపాయాలన్ని కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో - ఆర్డినేటరు పి.పంకజ్‌కుమార్, ఐఇ కో-ఆర్డినేటరు బి.భాస్కరరాజు, అలింకో కంపెనీ ప్రతినిధులు, నగర పాలక కో- ఆప్షన్ సభ్యులు పెదబాబు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, వారి తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



ఉపకరణాలు అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్ఏ చంటి

టేకు ప్లాంటేషన్ల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలి

పిసిసిఎఫ్ చలపతిరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అటవీ సంపద అన్యాక్రాంతం కాకుండ టేకు ప్లాంటేషన్ల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి (పిసిసిఎఫ్) చలపతిరావు తెలిపారు. మంగళగిరి ఫారెస్ట్ హెడ్ ఆఫీస్ నుంచి గురువారం జంగారెడ్డిగూడెం రేంజ్ పరిధిలో మండలంలోని రమనక్కపేట అటవీ శాఖ బీట్ పరిధిలో గత 17 ఏళ్ల క్రితం పరిశోధన చేసి 30 హెక్టార్లలో నాటిన టేకు మొక్కల ప్లాంటేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ప్లాంటేషన్‌లో మొక్కల ఎదుగుదలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ పరిధిలో ఉన్న సంపద అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. అదే విధంగా టేకు ప్లాంటేషన్ల వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మొక్కల పెరుగుదలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీ శుభం, సబ్ డిఎఫ్ఒ వెంకట సుబ్బయ్య, ఎఫ్ఆర్ఒ దుర్గకుమార్, డిఆర్ఒ ధర్మారావు, బీట్ అధికారులు మారేష్, లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి కోకో రైతుల సమస్యలు

ఆదుకుంటాం : మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోకో రైతుల సమస్యలను ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. గురువారం అమరావతి వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో కోకో గింజల కొనుగోలు, ధరల సమస్యలపై చర్చలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందించారు. వివిధ కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు సంయుక్త సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు పానుగంటి అచ్యుతరామయ్య, బోళ్ల వెంకట సుబ్బారావు, కోనేరు సతీష్‌బాబు, గుది బండి వీరారెడ్డి, జాస్తి కాశీబాబు, డి.నరేష్, కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్, ఉప్పల కాశీ తదితరులు మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలు కొనుగోలు చేయాలని, అన్ సీజన్ గింజలు వెంటనే కొనుగోలు చేసి కోకో రైతులను ఆదుకోవాలని కోరారు. కోకో తోటలు కౌలుకు తీసుకున్న కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీలు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కోకో రైతులను మోసం చేస్తున్నాయని కోకో రైతుల సంఘం నాయకులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. విదేశీ కోకో గింజల దిగుమతులు ఆపాలని, దేశీయంగా రైతుల నుంచి కోకో గింజలు కొనుగోలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కోకో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల ఏడో తేదీ లోపు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర ఇచ్చేలా, అన్ సీజన్ గింజలు కొనుగోలు చేసేలా కంపెనీలు తమ నిర్ణయాన్ని చెప్పాలని మంత్రి ఆదేశించారు. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వమే తగు నిర్ణయం తీసుకుంటుందని, కోకో రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



మంత్రి అచ్చెంన్నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

నేడు చలో కలెక్టరేట్, ధర్నాలు

జిల్లా ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యాన ప్రచారయాత్ర

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో జరిగే చలో కలెక్టరేట్ ర్యాలీ, ధర్నాల్లో ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరుతూ గురువారం జిల్లా ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఏలూరు నగరంలోని ఆటో స్టాండ్‌లలో ప్రచార యాత్ర నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్ నుంచి బయలుదేరిన ఈ ప్రచార యాత్ర ఏలూరు రైల్వేస్టేషన్, పవర్‌పేట రైల్వే స్టేషన్, ఆర్ఆర్ పేట, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా తిరిగి పాత బస్టాండ్ సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపీ మాట్లాడుతూ రాపిడో, ఉబర్, ఓలా సంస్థలను వ్యతిరేకించాలని ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. ఏలూరు నగరంలో దాదాపు ఐదు వేల మంది ఆటో డ్రైవర్లుగా జీవనోపాధి పొందుతున్నారని, ఆటో స్టాండ్‌లలో సీరియల్ పద్ధతి ఏర్పాటు చేసుకుని ఒక పద్ధతిలో కిరాయిలు తోలుకుంటున్నారని, ఈ పరిస్థితుల్లో కిరాయిలు వచ్చే సమయానికి రాపిడ్ వంటి సంస్థల వాహనాలు ప్రయాణికులను తరలించుకుపోతున్నారని, దీనిని అరికట్టాలని డిమాండ్ చేశారు. నగరంలోని ఆటో స్టాండ్‌లలో జరిగిన ప్రచార యాత్రకు అడ్డాల రాజు (నాని), బి.చంద్రశేఖర్, చక్రాల అమర్‌కుమార్, వై.బాలాజీ, ఇ.విజయ్‌కుమార్ నాయకత్వం వహించగా పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నూజివీడు-హైదరాబాద్ ఆర్‌టిసి బస్సు ప్రారంభం


ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చింతలవల్లి, చెక్కపల్లి, లోపూడి, ఎర్రావుగూడెం, కొత్తగూడెం, మర్రిపాలెం మీదుగా హైదరాబాద్ బస్సు సర్వీసు ప్రారంభించడంతో లోపూడి గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బస్సు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని మంత్రి పార్థసారథికి తెలియపరిచామని, విషయం చెప్పగానే నూజివీడు ఆర్‌టిసి డిపో మేనేజర్‌కి చెప్పి హైదరాబాద్ బస్సు ప్రారంభించారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్ష్మాయ కాంతారావు, నక్క చెన్నారావు, చలమల వెంకటేశ్వరరావు, శెట్టిపల్లి నూతనకుమార్, ఎంపిటిసి మాజీ సభ్యులు వెంకయ్య, పంది శ్రీను, తాళం వీరయ్య, పొదిలి కృష్ణ, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డివిఎల్‌టిసి సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండిషనర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఆ పైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. ఈ నెల 11 చివరి తేదీ అని పేర్కొన్నారు. వివరాలకు 9493482414 సంప్రదించాలని తెలిపారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

ఘనంగా కలిదిండి పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక కలిదిండి పబ్లిక్ స్కూల్ 29వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చేసిన సాంఘిక, భరతనాట్య నృత్యాలు ఆద్యంతం చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవం సందర్భంగా ఆ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు చేసిన వివిధ నాటక ప్రదర్శనలు చూపరులను కట్టిపడేశాయి. విద్యతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కరస్పాండెంట్ ఎస్‌వి.రాము (పొంగ్లి రాము), డైరెక్టర్ సానా మీనా సరస్వతి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్‌పి చైర్‌పర్సన్ అత్తయ్య మృతి

ఏలూరు సిటీ :ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అత్తయ్య గంటా అచ్చిమాంబ అనారోగ్య కారణాలతో గురువారం మృతి చెందినట్లు జెడ్‌పి చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయం వారు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పలువురు ఉద్యోగులు, రాజకీయ నాయకులు వారిని కలిసి పరామర్శించినట్లు తెలిపారు.

ఎఎస్‌ఐ జయకుమార్ సేవలు అభినందనీయం

టి.నరసాపురం :ఎఎస్‌ఐ వి.జయకుమార్ సేవలు అభినందనీయమని ఎస్‌ఐ ఎం.జయబాబు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎఎస్‌ఐగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ విరమణ పొందిన జయకుమార్‌ను పోలీస్ సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయబాబు మాట్లాడుతూ జయకుమార్ ఉద్యోగ బాధ్యతల్లో నిబద్ధత కలిగిన వ్యక్తి అని, అంకితభావంతో పని చేశారని చెప్పారు. సన్మాన గ్రహీత జయకుమార్ మాట్లాడుతూ 38 సంవత్సరాల పోలీసు శాఖకు సేవలందించి ఉద్యోగంతో ఉద్యోగ విరమణ చేయడం ఆనందంగా ఉందన్నారు. పలువురు కానిస్టేబుళ్లు ఆయనతో ఉన్న అనుభవాలను పంచుకున్నారు. ఇంటెలిజెన్సీ ఎఎస్ఐ నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, రైటర్ ఎం.రాజు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

వైసిపి నేత కుటుంబానికి పరామర్శ

ద్వారకాతిరుమల : వైసిపి సీనియర్ నేత గ్రామ నాయకుడు ఇమ్మడి నాగేశ్వరరావు (నాగు) తండ్రి సీనియర్ కిరాణా వర్తక వ్యాపారి నారాయణరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు గురువారం పరామర్శించారు. నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, రుద్ర శివాజీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, అచ్యుత్ యేసు, ఇమ్మడి శ్రీనివాస్, మాచికొండ సుబ్బారావు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

ఏలూరు సిటీ :కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి బాటలు వేసే క్రమంలో రహదారుల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి తెలిపారు. ఏలూరులో శాంతినగర్ నుంచి సెయింట్ ఆన్స్ కాలేజీ వరకు 22, 23, 24 డివిజన్ల పరిధిలో రూ.నాలుగు కోట్ల నిధులతో నూతనంగా నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లు శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి చంటి మాట్లాడుతూ ప్రాధాన్యతాక్రమంలో రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. నగర మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఎంఎల్ఎ బడేటి చంటి సారథ్యంలో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు.

వ్యత్యాసాలు లేకుండా చూడాలి

బుట్టాయగూడెం :రాష్ట్రంలో ప్రభుత్వ సహాయంతో దళిత, బలహీన తరగతుల ప్రజలు జనరిక్ మెడికల్ షాపులు పెట్టుకునేందుకు నోటిఫికేషన్ జారీ చేయడం అభినందనీయమని, అయితే ప్రభుత్వ ఉత్తర్వులు చూస్తే దళితులు, బలహీన తరగతుల లబ్ధిదారులకు వ్యత్యాసం కనిపిస్తుందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ అన్నారు. ఈ విధమైన వ్యత్యాసాలు లేకుండా ఎస్‌సిలకు కూడా అధిక లబ్ధి చేకూరే విధంగా చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల బాల వీరాంజనేయ స్వామిని ప్రకటన ద్వారా కోరారు. బిసిలు జనరిక్ మెడికల్ షాపు పెట్టుకుంటే రూ.ఎనిమిది లక్షలు ప్రభుత్వం ఇస్తే రూ.నాలుగు లక్షలు రాయితీ, రూ.నాలుగు లక్షలు బెనిఫిసిరి కట్టుకోవాలని తెలిపారు. కాని ఎస్‌సిలకు ప్రభుత్వం రూ.ఐదు లక్షలు ఇస్తే రూ.రెండు లక్షలు రాయితీ, రూ.మూడు కట్టుకోవాలని తెలిపారు. ఈ వ్యత్యాసం ఏమిటని, ఖర్చు అందరికి ఒకేలా ఉంటుందని, తేడా ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల వివక్ష చూపుతుందనిపిస్తుందని తెలిపారు. దీనిపై పరిశీలన చేసి బిసిలకు ఇచ్చినట్లు ఎస్‌సిలకు సమాన అవకాశాలు, అంతకంటే ఎక్కువ లబ్ధి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే 2019లో ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణాలను విడుదల చేయాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

నకిలీ పోలీసుల ముఠా అరెస్టు

ఏలూరు స్పోర్ట్స్ :నకిలీ పోలీసులుగా మారి సినీ ఫక్కీలో వసూళ్లకు పాల్పడుతున్న ఓ ముఠాకు ఏలూరు భీమడోలు పోలీసులు చెక్ పెట్టి వారిని కటకటాలపాలు పాలు చేశారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో గురువారం సాయంత్రం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు వివరాలు వెల్లడించారు. భీమడోలు చుట్టుపక్కల ప్రాంతాల్లో గుర్తుతెలియని ముఠా పోలీసు అధికారుల దుస్తుల్లో జాతీయ రహదారిలో తెరిచి ఉంచిన దుకాణాల వద్దకు వెళ్లి తాము పోలీసులమని, రాత్రి వేళల్లో దుకాణాలు ఎందుకు తెరిచారని బెదిరింపులకు గురిచేస్తూ వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ద్వారకాతిరుమల మండలం పావులవారిగూడెం ప్రాంతంలో మాండ్రు డేవిడ్ అనే వ్యక్తి టీ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. భీమడోలు మండలం పూళ్ల గ్రామానికి చెందిన గంగా ప్రశాంత్ కుమార్ అనే వ్యక్తి పోలీసు దుస్తులు ధరించి అతని వద్దకు రాత్రిపూట వెళ్లి ఈ సమయంలో దుకాణం తెరిచి అమ్మకాలు సాగిస్తుంటే మిమ్మల్ని చితక్కొట్టి చంపేస్తామని బెదిరించారు. మరో వ్యక్తి పెరికె సురేంద్రకుమార్ లాఠీ పట్టుకుని అతని వెనుక వచ్చాడు. అంతటి ఆగకుండా డేవిడ్ వద్ద నుంచి రూ.వెయ్యి వసూలు చేశారు. అదే సమయంలో హైవే పెట్రోలింగ్ వాహనం వస్తుండడంతో మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి కారులో వారు పరారయ్యారు. ఈ ఘటనపై డేవిడ్ ద్వారకాతిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ద్వారకాతిరుమల పోలీసులు ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో భీమడోలు సిఐ వెల్సన్ సారథ్యంలో ఎస్ఐ సుధీర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం భీమడోలు జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ప్రశాంత్‌కుమార్, సురేంద్రకుమార్, గొల్ల సురేష్‌కుమార్, కోరపాటి రోహిత్ అనే నలుగురు వ్యక్తులను పోలీసులు నిందితులుగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కారును, పోలీస్ యూనిఫామ్ చొక్కా, ప్యాంటు, లాఠీ స్వాధీనం చేసుకున్నారు.

త్రివిధ విద్యా సంస్థలో ఇంటర్మీడియట్

ప్రణాళికాబద్ధంగా బోధన
క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో శిక్షణ
ఫౌండర్, ప్రిన్సిపల్ సబ్బినేని శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని త్రివిధ విద్యాసంస్థ హై స్కూలు స్థాయి నుంచి ఇంటర్మీడియట్ కళాశాల స్థాయికి రావడం అభినందనీయమని పలువురు విద్యావేత్తలు, సామాజికవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు ప్రశంసిస్తున్నారు. విద్యా సంవత్సరం 2025 - 26 నుంచి ఇంటర్మీడియట్ విద్యను ప్రారంభిస్తున్నట్లు త్రివిధ విద్యాసంస్థల ఫౌండర్, ప్రిన్సిపల్ సబ్బినేని శ్రీనివాస్ తెలిపారు. పట్టణ పరిధిలోని కోనేరు పేటలో ఉన్న త్రివిధ విద్యాసంస్థల ఆవరణలో ఆయన గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటివరకు హైస్కూల్ విద్య వరకు కొనసాగుతున్న తమ విద్యాసంస్థను ఆదరిస్తున్న అన్ని తరగతుల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. క్రమశిక్షణ, ఉత్తమ బోధన కొనసాగిస్తూ ఇంటర్మీడియట్ వేరే ప్రాంతానికి వెళ్లడానికి తల్లిదండ్రులకు పెద్దగా ఇష్టం ఉండకపోవడంతో వారందరి ప్రోత్సాహం వల్ల కళాశాల ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ కళాశాల అందుబాటులో ఉంటుందన్నారు. అత్యంత అనుభవం కలిగిన అధ్యాపకుల నేతృత్వంలో త్రివిధ ఇంటర్మీడియట్ కళాశాల కొనసాగుతుందన్నారు. త్రివిధ విద్యాసంస్థలో ఇంటర్మీడియట్ కళాశాల ప్రారంభమైన నేపథ్యంలో అన్ని తరగతుల ప్రజల ఆశీస్సులు ఉండాలని త్రివిధ (సబ్బినేని) శ్రీనివాస్ అభిలాషించారు. ఈ కొత్త ప్రయత్నాన్ని ఆశీర్వదించి బలోపేతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఇప్పటివరకు హై స్కూల్ స్థాయి విద్యలో బోధన అందించినట్లు, అత్యుత్తమ ఫలితాలు పొందేలా ప్రణాళికలు రచించినట్లు తెలిపారు.

నేవీలో 1985 నుంచి 2000 సంవత్సరం వరకు అత్యుత్తమ విధులు నిర్వర్తించిన సబ్బినేని శ్రీనివాస్ విద్యా సంస్థ నిర్వహణలో ఎన్నో జాగ్రత్త చర్యలు చేపట్టి అందరి మన్ననలు పొందారని పలువురు అన్నారు. చిన్నారుల విద్యకు తొలి పునాది త్రివిధలో పడగా అత్యుత్తమ ప్రతిభ కనపరుస్తూ ఫలితాలు పొందిన తరువాత వేరొక కళాశాలకు వెళ్తూ ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దగా మక్కువ చూపకపోవడంతో కళాశాల ఏర్పాటుకు కృషి చేసినట్లు పలువురు సన్నిహితులు వ్యాఖ్యానిస్తున్నారు.

చదువు అంటే విద్యార్థులను బెత్తంతో దండించే విధానానికి స్వస్తి పలికి పాఠ్యాంశాల పట్ల ఇష్టం ఏర్పడేలా విద్యార్థులను తీర్చిదిద్ది అత్యుత్తమ ఫలితాలు సాధించడంతో బంగారు భవితకు నాందిగా ముందడుగు వేయడం త్రివిధ శ్రీనివాస్ మాస్టారుకు వెన్నతో పెట్టిన విద్య అని పలువురు అన్నారు. అక్కడ నేవీలో అవినీతి అక్రమాలను తుదముట్టించి ఇక్కడ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి నాణ్యమైన విద్య శాశ్వతంగా నిలిచి ఉంటుందని నమ్మి ఆ సిద్ధాంతాన్ని నూటికి నూరు శాతం అమలు చేసిన విద్యావేత్త శ్రీనివాస్ మాస్టర్ అని చెప్పారు.

ఇంటర్ పై ఎన్నో ఆశలు

త్రివిధ మార్క్ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ కళాశాల చేరడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎన్నో ఆశలు రేకెత్తుతున్నాయి. హై స్కూల్ విద్య మాదిరిగానే ఇంటర్ విద్యలోనూ అత్యుత్తమ శిక్షణతో గొప్ప ఫలితాలను సాధించడం ఇంటర్ కళాశాలలో రికార్డు సృష్టించడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదని విద్యార్థుల తల్లిదండ్రులు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. త్రివిధ విద్యాసంస్థల పూర్వ విద్యార్థి సూర్య వర్ధన్ ఐఐటి ఖరగ్పూర్‌లో మంచి ర్యాంకుతో విద్యను అభ్యసించారు. తాను కూడా త్రివిధ విద్యాసంస్థల్లో విద్యార్థులను తీర్చిదిద్ది విజ్ఞానవంతులుగా ముందడుగు వేసేలా పర్యవేక్షిస్తానన్నారు. అత్యంత అనుభవం గల అధ్యాపకులు నవుడు నాగమల్లేశ్వరరావు విద్యార్థులకు బోధిస్తామని తెలిపారు. ఇలాఎంతోమంది త్రివిధ విద్యా సంస్థలో విద్యార్థుల భవిష్యత్తు కోసం బంగారు బాటలు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కార్పొరేట్ కళాశాలలకు నూజివీడు పరిసర ప్రాంత విద్యార్థులు వెళ్లకుండా స్థానిక మార్క్‌తో త్రివిధ విద్యాసంస్థల్లో అనుసంధానంగా ఇంటర్మీడియట్ కళాశాల ప్రారంభించడం ఈ ప్రాంత వాసులకు గొప్ప శుభవార్తగా చెప్పక తప్పదు. హై స్కూల్ స్థాయి ఫలితాలను అధిగమిస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకుల సాధకులుగా త్రివిధ ఇంటర్మీడియట్ కళాశాల ఎదగాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

రూ.44.80 లక్షలతో తాగునీటికి ప్రణాళిక

ప్రజాశక్తి - ఉంగుటూరు

వేసవిలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అధికారులను కోరారు. గురువారం ఆమె అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రూ.44.80 లక్షలతో అవసరమైన చోట కొత్తగా బోర్లు, మోటార్లు బిగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎంపిడిఒ రాజ్‌మనోజ్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే మండల పరిషత్ నిధుల నుంచి రూ.37.30 లక్షలతో ఫిల్టర్ మీడియా, నీటి నిర్వహణ నిమిత్తం ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామారావు, పంచాయతీ విస్తరణ అధికారి చంద్రశేఖరం, కార్యదర్శులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పర్యటించిన పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పరింపూడిలో రూ.49 లక్షలతో జలజీవన మిషన్ ద్వారా 60 వేల తాగునీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన, అంకలగూడెం గ్రామంలో రూ.20 లక్షలతో భవన నిర్మాణ కార్మికుల భవనం ప్రారంభించారు. అనంతరం కొయ్యలగూడెంలోని పరింపుడి-2లో రూ.43 లక్షలతో సచివాలయాన్ని ప్రారంభించారు. గ్రామసభలో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పాలనలో రాష్ట్రంలో ప్రతి ఇంటికి ఏదో విధంగా సంక్షేమ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా కూటమిలోని నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ చూపాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం దెందులూరు నియోజకవర్గంలోని పలువురు కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు ఎంఎల్ఎ ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి అరాచక పాలనలో దెందులూరు నియోజకవర్గ ప్రజలు తీవ్ర కష్టాల పాలయ్యారన్నారు. వారి వ్యక్తిగత సమస్యలను, గ్రామ సమస్యలను తీర్చడంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ చూపి వారికి అండగా నిలబడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), ఏలూరు రూరల్ మండలాధ్యక్షులు నంబూరి నాగరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సామాజిక విప్లవకారులు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఈ నెల 5న, మహాత్మా జ్యోతిబా పూలే జయంతి 11న, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి 14న ఘనంగా నిర్వహించాలని బిసి సబ్ ప్లాన్, ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో-కన్వీనర్ ఆగోల్ల కృష్ణారావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పోరాట వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాల్లో బిసి నాయకులు, కార్యకర్తలు, చేతి వృత్తిదారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ ప్రకటనలో కోరారు.

ప్రజలకు సమస్యలు లేకుండా చూడాలి

నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజు

ముసునూరు :ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉండకూడదని వారంలో ఒకరోజు మండలాన్ని సందర్శిస్తున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ తెలిపారు. మండలంలోని కొర్లకుంట, తాళ్లవల్లి, ముసునూరు గ్రామాల్లో ఉన్న రెవెన్యూ రికార్డులు మ్యూటేషన్ పద్ధతులో మార్పులు, చేర్పులు ఉండటంతో వాటిని రెవెన్యూ అధికారులు సరి చేయడంలో విఫలమవుతున్నారని, దీంతో గ్రామస్తులు వారిపై ఒత్తిడి తీసుకురావడంతో మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా సోమవారం మండలంలోని 16 గ్రామాల్లో ఏ ఒక్కరికి ఏ సమస్య ఉన్నా ఫిర్యాదు రూపంలో తెలియజేస్తే పరిష్కరించనున్నట్లు చెప్పారు. తహశీల్దార్ కె.రాజకుమార్ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో పలు రికార్డులను పరిశీలించారు.

పాఠశాలలో ఛత్రపతి శివాజీ వర్ధంతి

చాట్రాయి :మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో ఛత్రపతి శివాజీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు మాట్లాడుతూ శివాజీ 17 ఏళ్ల వయసులో యుద్ధం ప్రారంభించి అనేక యుద్ధాలు చేశారన్నారు. అబ్దుల్ ఖాన్‌తో యుద్ధం చేసి అతని తల నరికి శివాజీ మరాఠీ యోధుడుగా మహారాష్ట్రమంతట పేరు తెచ్చుకున్నాడన్నారు. పరిపాలన విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజ్యాల్లో అగ్రవీరుడన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పుస్తక పఠన దినోత్సవం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని గొల్లపల్లి శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ పుస్తక దినోత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాధికారాణి తెలిపారు. పుస్తక పఠనంతో విద్యార్థుల జ్ఞానం పెరుగుతుందని తెలిపారు. పుస్తక పఠనం వల్ల జ్ఞానంతో విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, సంస్కారం, విలువలు పెరుగుతాయన్నారు. తలదించుకుని చదివితే తల ఎత్తుకొని జీవించేటట్లు పుస్తకం చేస్తుందని, విద్యార్థులు గుర్తించుకోవాలని తెలిపారు. పుస్తకం ఒక మంచి నేస్తమని, పుస్తక పఠనం వల్ల పాత తరాల వారితో మాట్లాడిన అనుభూతిని కలుగుచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, విఠల్ బాబు, సాకా రవి, రాధిక, మల్లేశ్వరి, విజయలక్ష్మి, మనోహరం, లైబ్రేరియన్ నారాయణ, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ లక్ష్మి, నాన్ టీచింగ్ సిబ్బంది వరలక్ష్మి, రంగారావు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని

ప్రజాశక్తి - దెందులూరు

ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని, అందులో భాగంగానే దెందులూరు నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.వంద కోట్లతో 14 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా గ్రామాల్లో సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం దెందులూరు నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖాధికారులు, సర్వేయర్ల బృందాలతో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పేద ఎస్‌సి, ఎస్‌టిలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ అందించే దిశగా ముందుకు వెళ్తుందని, వీటిలోభాగంగా ప్రతి ఇంటిని కూడా ఒక యూనిట్‌గా భావించి దెందులూరు నియోజకవర్గ పరిధిలోని 14 వేల ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు సోలార్ విద్యుత్ అందించే విధంగా ఆయా గ్రామాల్లోనే సోలార్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఇందుకోసం దెందులూరు నియోజకవర్గ పరిధిలోని దెందులూరు, పెదవేగి, పెదపాడు సహా ఏలూరు రూరల్ మండలం ప్రాంతాల్లోని ఎస్‌సి, ఎస్‌టిలకు వారి గ్రామాల్లోనే సోలార్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టామని, ఆయా గ్రామాల యూనిట్ల మొత్తాన్ని కలిపి నియోజకవర్గంలోని ఎస్‌సి, ఎస్‌టిలకు అవసరమైన 14 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా రూపకల్పన చేస్తున్నామని, ఇందుకోసం దాదాపు రూ.వంద కోట్లు ప్రభుత్వం వెచ్చించి సోలార్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుందని తెలిపారు.

సర్వే బృందానికి భూ యజమానులు సహకరించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో ప్రారంభమయ్యే భూ సర్వేకు భూ యజమానులు సహకరించాలని తహశీల్దార్ టి.సాయిబాబా తెలిపారు. ఏపిగుంట పంచాయతీలోని గుర్వాయిగూడెంలో భూ సర్వేపై రైతులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే బృందాలు గ్రామ సరిహద్దులు సర్వే చేసిన అనంతరం రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములు సర్వే చేస్తారని ఆయన తెలిపారు. సర్వే సమయంలో రైతులు తమ పొలం దస్త్రాలు అధికారులకు చూపించి సర్వేకు సహకరించాలన్నారు. భూ సమస్యలు ఉంటే సర్వే సిబ్బందికి తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ స్రవంతి, సర్వేయర్ వెంకట రమణ, విఆర్ఒ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కైకలూరుకు చెందిన న్యూస్ రైట్ దినపత్రిక ఎడిటర్ కూరేళ్ల కిశోర్‌పై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలంటూ ముదినేపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపియుడబ్ల్యుజె జిల్లా కార్యవర్గ సభ్యులు వి.విజయకుమార్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సిహెచ్.నాగరాజు మాట్లాడుతూ మార్చి 27న మీడియా కవరేజ్ కోసం భుజబలపట్నం వెళ్లిన న్యూస్ రైట్ ఎడిటర్ కూరెళ్ల కిషోర్‌పై నాయకులు మూకుమ్మడిగా దాడికి పాల్పడి విచక్షణారహితంగా గాయపరిచిన నాయకులపై కేసు నమోదు చేసి బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరులపై దాడులకు పాల్పడకుండా, వారికి భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన నిబంధనలు అమలు పరచాలని కోరారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ కార్యాలయంలో డీటీ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జి.చంద్రశేఖర్, పరిసే నందేశ్వరరావు, భుజంగం, ఎస్.శివ, వీర్రాజు, బొర్రా శివరాజు, బొర్రా శ్రీనివాసరావు, టి.సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

పెయ్యేరులో చలివేంద్రం ప్రారంభం

ముదినేపల్లి :వేసవి దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు పెయ్యేరు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎంపిడిఒ వై.రామకృష్ణ, గ్రామ సర్పంచి అల్లు సుశీల చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రంలో తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు దుక్కపాటి శేషుబాబు, జాస్తి బాబు రాజేంద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి జి.రమేష్, గ్రామ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

బిజెపి పాలనలో పేదలకు నష్టం

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

చింతలపూడి :దేశంలో బిజెపి అధికారంలోకొచ్చిన తర్వాత పేదలకు తీవ్రమైన నష్టం జరిగిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సిపిఐ మండల 13వ మహాసభ ఎస్‌కె కాలేషా జంగా రామచంద్ర రెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకొచ్చిన తర్వాత పేదలకు తీవ్ర నష్టం జరిగిందని, రైతాంగానికి వ్యతిరేకంగా నాలుగు నల్ల చట్టాలు, కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందన్నారు. న్యాయ వ్యవస్థ ప్రమాదంలో పడిందని, కేంద్ర ప్రభుత్వం న్యాయ వ్యవస్థను, ఎన్నికల కమిషన్‌ను తన చేతిలో పెట్టుకుందని చెప్పారు. విద్యుత్ కష్టాలు పెరిగాయని, భవిష్యత్తులో వీటిపై పోరాటం చేయాలన్నారు. ముఖ్యమంత్రి పోలవరం, అమరావతి మాత్రమే ఆలోచిస్తున్నారు తప్ప పేదల గురించి ఆలోచించడం లేదన్నారు. మహాసభకు ముందుగా సిపిఐ జెండాను సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు ఆవిష్కరించారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, జనార్ధనవరం

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం./2025 తేది.03-04-2025

ఏలూరు జిల్లా, చాట్రాయి మండలం, జనార్ధనవరం గ్రామపంచాయితీ పరిధిలో 2025-2026 ఆర్థిక సం॥రం లో పని చేయుటకు టెండర్ల ద్వారా నియమించటం జరుగుతుంది. ఈ టెండర్లు ది.10-04-2025 తేదీన గ్రామ పంచాయితీ కార్యాలయంలో మధ్యాహ్నం 2.00 గంటలకు గ్రామపంచాయితీ కార్యాలయం నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, (లేదా) వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడి, హాజరైన టెండరుదారుల సమక్షంలో సదరు టెండర్లు తెరువబడును. టెండరు షరతులు మిగిలిన విషయములు కార్యాలయము పనిచేయు వేళలందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పనివివరము	కాలపరిమితి
1	మంచినీటి ట్యాంక్ ఆపరేటర్ - 1	1-4-2025 నుండి 31-3-2026 వరకు
2	వీధి దీపాల నిర్వహణ - 1	1-4-2025 నుండి 31-3-2026 వరకు
3	పారిశుద్ధ్య పనుల నిర్వహణ - 3	1-4-2025 నుండి 31-3-2026 వరకు
4	మోటార్ మెకానిక్ - 1	1-4-2025 నుండి 31-3-2026 వరకు

గమనిక: 1) గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 2) గ్రామ పంచాయితీ నిధులను బట్టి చెల్లింపులు జరుపబడును. 3) టెండర్లు నిర్వహించుటకు (లేదా) రద్దుచేయుటకు గ్రామపంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.

సం/- పామర్తి ఝాన్సీరాణి
సర్పంచ్, జనార్ధనవరం గ్రామపంచాయితీ
చాట్రాయి మండలం, ఏలూరు జిల్లా.

సం/- హరి హనుమంతరావు
గ్రామపంచాయితీ కార్యదర్శి, జనార్ధనవరం
చాట్రాయి మండలం, ఏలూరు జిల్లా.

సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఈ నెల నాలుగో తేదీ శుక్రవారం జరగాల్సిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ 1 నుంచి 7 వరకు ఉన్న స్థాయీ సంఘ సమావేశాలు, సర్వసభ్య సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సదరు సమావేశాలు జరిగే తేదీ త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

'సువర్ణరాజుపై అసత్య ఆరోపణలు సరికావు'

ద్వారకాతిరుమల :జనసేన గోపాలపురం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సువర్ణరాజు ఎంతో నిజాయితీపరులని, ఆయన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేని కొంతమంది చేసిన అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నామని పార్టీ మండల ఉపాధ్యక్షులు చిలుకూరి ఫణి, వీరేంద్ర అన్నారు. మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. బియ్యం సేకరణ దగ్గర నుంచి వాటిని ఒక చోటుకు చేర్చడం, అవి పాడైపోవడంతో వాటిని విక్రయించి ఆ సొమ్మును ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ద్వారా సిఎం సహాయనిధికి అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ విషయం మొత్తం తమ పార్టీ వారందరికీ తెలుసన్నారు. మార్చి 20వ తేదీన జంగారెడ్డిగూడెంలో నామినేటెడ్ పదవులకు సంబంధించి జరిగిన సమావేశం మరుసటి రోజే సువర్ణరాజుపై బురద జల్లే కార్యక్రమం మొదలైందన్నారు. ఇందుకు ఉదాహరణ ద్వారకాతిరుమల గ్రామంలో ఉన్న గ్రూపులో ఆయనకు వ్యతిరేకంగా పోస్టు రావడమేనన్నారు. అసత్య ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

CHANGE OF NAME

I, MARRAPU DHANNJAYARAO Son of MARRAPU APPALA SWAMY, R/o D.No.5-129, Kamakshamma Temple, Eluru Mandal, Ponangi, West Godavari District changed my name MARRAPU DHANNJAYARAO (old name) to MARRAPU DHANAMJAYA RAO (new name) same as intimated to genral Public

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో

I.P.No. 11/2025

Between:

Adabala Manikanta ...Petitioner/Debtor

AND

Atragadda Jyothi & 40 others ...Respondents/Creditors

DESCRIPTION OF THE PETITIONER/DEBTOR:

1) Sri Adabala Manikanta, Tadepalligudem

DESCRIPTION OF THE RESPONDENTS/CREDITORS:

1) Atragadda Jyothi, Tadepalligudem,
2) Tadi Narasimha Murthy, Tadepalligudem
3) Rudra Ratnaji, Tadepalligudem
4) Arjula Arun Kishore, Tadepalligudem
5) Guna Ayyapa, Tadepalligudem
6) Pasupuleti Veera Swamy, Tadepalligudem
7) Achanta Pallavi, Tadepalligudem
8) Dodla Chinna Balaji, Tadepalligudem
9) Kamisetti Srinivas, Tadepalligudem
10) Yalla Satyanarayana (Babu),
11) Bodapati Murali Krishna, Tadepalligudem
12) Jaggam Setti Nagi reddy, Ravulapalem Village and Mandal
13) Padala Rama Chandra Reddy, Ravulapalem (V) & (M)
14) Revuri Veera Venkata Satyanarayana Reddy, Ravulapalem (V) & (M)
15) Padala Venkateswararao, Ravulapalem Village and Mandal
16) Bhimi Reddy Satti Reddy, Ravulapalem Village and Mandal
17) Tatipaka Sri Harsha, Ravulapalem Village and Mandal
18) Vanapalli Raju, Ravulapalem Village and Mandal
19) Balireddy Srinivasararao, Ravulapalem Village and Mandal
20) Chippada Anil Kumar, Tadepalligudem
21) Polisetti Chandra SK Swamy Naidu, Ravulapalem Village and Mandal
22) Yogi Hanumanth Sai Nambula, Tadepalligudem
23) Karri Siva Reddy, Ravulapalem Village and Mandal
24) Anipireddy Bhaskar Rao, Ravulapalem Village and Mandal
25) Padala Ramachandra Rao, Ravulapalem Village and Mandal
26) Kurri Srinivas, Ravulapalem Village and Mandal
27) Kapaganti Subrahmanyam, Ganapavaram Mandal
28) Padala Satish Kumar Reddy, Rajahmundry Town and Mandal
29) Maddipatla Maha Naga Satyanarayana, Tadepalligudem
30) Kommula Rama Krishna, Tanuku
31) Dwarapudi Subhakar Reddy, Bikkovole Mandal
32) Katari Ashok Kumar Reddy, Ravulapalem Village and Mandal
33) Mutta Durga Rao, Mettauppergudem
34) Venkata Reddy Padala, Ravulapalem Village and Mandal
35) Midde Rajesh, Denduluru Mandal, Eluru
36) Yeedupuganti Suresh, Duvva, Tanuku Mandal
37) Dusanapudi Vijay, Tadepalligudem
38) Vasa Harinadh, Tadepalligudem
39) Midde Srikanth, Pothunuru, Denduluru Mandal, Eluru
40) Merupo Rahul Lal, Tadepalligudem,
41) The official receiver, Eluru, West Godavari district

Petitioner (పిటిషనర్)/Debtor (ఋణగ్రహీత) తరపున దాఖలు చేసిన పత్రిక ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ వ్యాపారంలో నష్టపోయిన కారణంగా ఎవరికి డబ్బులు చెల్లించలేని పరిస్థితుల కారణంగా పై నెంబర్ గల I.P దావాను తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) వారి కోర్టులో వేసినారు. దావాలో రెస్పాండెంట్స్ (క్రెడిటర్స్)/ప్రతివాదులుకు శ్రీ గౌరవనీయులైన కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారం పత్రిక ప్రకటన ద్వారా సబ్ స్టిట్యూట్ సర్వీస్ నిమిత్తం కోర్ట్ వారు ఉత్తర్వులు జారీ చేసినారు. మీరు **దీ. 21-04-2025 వ తేదీ ఉదయం గం. 10-30 ని.లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై స్వయముగా కాని, న్యాయవాది ద్వారా కాని మీ యొక్క ఆక్షేపణలను తెలియజేసికోవలసు. లేనియెడల సదరు నెంబరు I.P దావా న్యాయస్థానం వారు మీ పరోక్షమున తీర్మానించెదరు అని తెలియజేయడమైనది.

(By order of the Hon' ble court)

M. YESUPADAM, M.A.BL
M.B.AVINASH, LLM
ADVOCATES
TADEPALLIGUDEM

TADEPALLIGUDEM
Dt: 03-04-2025

CELL NO. 7396446127, 7893674560